www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | శుక్రవారం, అక్టోబర్ 16,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 221 | సంచిక:194 | పేజీలు: 8 | వెల: రూ.5/-

సామూహిక అత్యాచారం.. మహిళపైనా కేసు పెట్టొచ్చు

సామూహిక అత్యాచారం (గ్యాంగ్ రేప్) కేసులో ఓ మహిళ నేరుగా శారీరకంగా పాలుపంచుకోకపోయినా, ఆ నేరానికి పాల్పడిన బృందంలో భాగమై ఉన్నా లేదా ఉమ్మడి ఉద్దేశంతో వ్యవహరించినా.. ఆమెపైనా అభియోగాలు నమోదు చేయవచ్చని ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఐపీసీ సెక్షన్ 376డి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 70 కింద మహిళను కూడా నిందితురాలిగా చేర్చవచ్చని స్పష్టం చేసింది. జస్టిస్ అనూప్ జైరాం భంభానీ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది. ఓ మహిళ, మరో నిందితుడిపై నమోదైన అభియోగాలను సవాలు చేస్తూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసింది. సామూహిక అత్యాచారానికి సంబంధించిన చట్టాల్లో ఉపయోగించిన 'వ్యక్తులు' అనే పదాన్ని కేవలం పురుషులకు మాత్రమే పరిమితం చేయలేమని, దాన్ని లింగ రహితంగా చూడాలని కోర్టు అభిప్రాయపడింది.



ఏ ఒక్క స్థానమూ ఖాళీగా ఉండకూడదు

- క్షేత్రస్థాయిలోనే ఉండాలని పార్టీ పరిశీలకులకు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశం
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు అభ్యర్థులకు అండగా ఉండాలని సూచన

మిగతా 2వ పేజీలో..

కమీషన్ల అడ్డాగా సీఎం ఆఫీస్



- కాంగ్రెస్‌ది పచ్చి దోపిడీ, లూటీ పాలన
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

మిగతా 2వ పేజీలో..



పేదోడి 58కు మౌనం.. 59కు పచ్చజెండా?

- 125 గజాల గుడిసెకు పట్టాపై స్పష్టతేదీ?.. 500 గజాల దరఖాస్తులకు నెల గడువు!
- ప్రజా ప్రభుత్వంలో పేదల ఉచిత పట్టాలకు ప్రాధాన్యమెక్కడ?
- ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణపై అనుమానాలు!
- జీవో 59 పెండింగ్ దరఖాస్తులకు మెమో 48030.. జీవో 58 లబ్ధిదారుల కోసం ప్రత్యేక కార్యాచరణ ఏది?
- హైదరాబాద్ శివారు మండలాల్లో పెద్ద స్థలాలను 500 గజాల ముక్కలుగా చూపించే ప్రయత్నాలకు అడ్డుకట్ట పడేదెలా?
- పాత దరఖాస్తులు, సర్వే రికార్డులు, లబ్ధిదారుల అర్హతలపై సమగ్ర విచారణకు డిమాండ్

మిగతా 2వ పేజీలో..

సామాన్యుడి అస్త్రం / తెలంగాణ బ్యూరో

పేదవాడి గుడిసెకు పట్టా ఇవ్వాలంటే ఏళ్ల నిరీక్షణ, వందల గజాల ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను మాత్రం నెల రోజుల్లో పరిష్కరించాలంటూ ఆదేశాలు! రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో జీవో 58, 59ల అమలుపై కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జీవో 59 కింద 500 చదరపు గజాల వరకు ఉన్న పెండింగ్ దరఖాస్తులను నెల రోజుల్లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం మెమో నంబరు 48030 జారీ చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్టోబరు 9న వెల్లడించారు.

యాసంగిలో ఆరుతడి పంటలే మేలు

- ఎల్ నినో పరిస్థితుల్లో రైతన్నకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- అన్నదాతలు పెద్ద మనసు చేసుకుని సహకరించాలి
- రిజర్వాయర్లలో 209 టీఎంసీల నీళ్లే అందుబాటులో..
- తాగునీటికే ప్రాధాన్యత.. మంత్రులతో సీఎం సమీక్షం



మిగతా 2వ పేజీలో..

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం

రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!



మిగతా 2వ పేజీలో..

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు



- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
- ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్
- ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అ వినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాల యం (సీఎంవో) ఏకంగా 15 శాతం క మీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షే మాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు. తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకు న్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?

- తెలంగాణలో 24 లక్షల ఎకరాల అటవీ భూమి మాయమైందని బీజేపీ ఆరోపణ
- పెద్ద నాయకులే ప్రభుత్వ, పేదల భూములను కబ్జా చేస్తున్నారని విమర్శ

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో దాదాపు 24 లక్షల ఎకరాల అటవీ భూమి లెక్కల్లో వ్యత్యాసం కనిపిస్తోందని, ఆ భూమి ఏమైందో ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రముఖ నాయకులే ఈ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. నేడు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూముల అక్రమాలకు సంబంధించిన గణాంకాలను ఆయన వివరించారు.


మిగతా 2వ పేజీలో..

తిరుమలలో స్వల్పంగా పెరిగిన భక్తుల రద్దీ

- సర్వదర్శనానికి 27 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు
- టోకెన్లు లేనివారికి దర్శనానికి 8 గంటల సమయం
- బుధవారం శ్రీవారిని దర్శించుకున్న 84 వేల మంది పైగా భక్తులు

అమరావతి, ((సామాన్యుడి అస్త్రం)

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ స్వల్పంగా పెరిగింది. గురువారం ఉదయం నాటికి, సర్వదర్శనం కోసం భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 27 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనం లభించడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వెల్లడించారు.



నారాయణపేటలో దారుణం

- పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య
- వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను హత్య చేసిన భార్య



హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

వివాహేతర సంబంధం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్త మరో మహిళతో సంబంధం పెటుకున్నాడన్న ఆగ్రహంతో రగిలిపోయిన భార్య, పెట్రోల్ పోసి నిప్పంటించి అతడిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘోరం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటుచేసుకుంది

మిగతా 2వ పేజీలో..

ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి

- ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరిగాయని సీఎస్ వెల్లడి
- పంటలకు రానున్న 15-20 రోజులు కీలకం

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్ర ంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరి ష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపా రు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గ ణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు.

మిగతా 2వ పేజీలో..



పేదోడి 58కు మౌనం.. 59కు పచ్చజెండా?

మొదటి పేజీ తరువాయి

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అర్హుల దరఖాస్తులకు పరిష్కారం చూపడం అవసరమే. అయితే పేద కుటుంబాలకు 125 గజాల వరకు ఉచిత పట్టాలు ఇచ్చేందుకు రూపొందించిన జీవో 58 పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. రుసుము చెల్లించే దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక గడువు ప్రకటించిన ప్రభుత్వం, ఉచిత పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేదల విషయంలోనూ అదే చొరవ చూపుతుందా? ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కారు ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పేదోడి గూడు కోసమే కదా..!

ప్రభుత్వ స్థలాల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేద కుటుంబాలకు చట్టబద్ధమైన భరోసా కల్పించాలనే ఉద్దేశంతోనే 2014 డిసెంబరు 30న అప్పటి తెలంగాణ ప్రభుత్వం జీవో 58, 59లను తీసుకొచ్చింది. అంతకుముందు అమల్లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టం కింద ప్రభుత్వానికి సంక్రమించిన మిగులు భూములు, అభ్యంతరాలు లేని ఇతర ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారి సమస్యలను పరిష్కరించడం వీటి ప్రధాన లక్ష్యం. జీవో 58 ప్రకారం 2014 జూన్ 2 నాటికే నివాస గృహం కలిగి, నిర్ణీత అర్హతలు ఉన్న పేద కుటుంబాలకు 125 గజాల వరకు ఉచితంగా పట్టా ఇవ్వడానికి అవకాశం కల్పించారు. భూమికి ధర చెల్లించే స్థోమత లేని నిరుపేదలకు ఈ జీవో ఒక భరోసాగా నిలవాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. మరోవైపు జీవో 59 కింద అర్హత కలిగిన స్థలాలను నిర్ణీత రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం ఇచ్చారు. పేదలకు ఉచిత పట్టా, ఇతర అర్హులకు చెల్లింపు ఆధారంగా క్రమబద్ధీకరణ.. ఇదీ రెండు జీవోల మధ్య ప్రధాన వ్యత్యాసం.

500 గజాల వరకు 50 శాతం రుసుము!

జీవో 59 అమలుకు సంబంధించి 2015 జనవరి 30న జీవో 12 ద్వారా రుసుములను సవరించారు. సాధారణ అర్హుల నివాస స్థలాలకు 250 గజాల వరకు ప్రభుత్వ బేసిక్ విలువలో 25 శాతం, 250 గజాలకు మించి 500 గజాల వరకు 50 శాతం, అంతకంటే ఎక్కువ విస్తీర్ణానికి 75 శాతం చెల్లించే విధానం తీసుకొచ్చారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు 126 నుంచి 150 గజాల వరకు కొన్ని ప్రత్యేక రాయితీలూ కల్పించారు. అయితే అనంతరం వెలువడిన ఉత్తర్వులు, భూమి విలువ లెక్కించే తేదీ, నివాస నిర్మాణ విస్తీర్ణం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా 2023లో వచ్చిన జీవో 22 ప్రకారం దరఖాస్తు తేదీ నాటి బేసిక్ విలువను వర్తింపజేసే అంశాన్ని హైకోర్టు సమర్థించింది. కాబట్టి ప్రతి దరఖాస్తుకు ఎంత రుసుము నిర్ణయించారు, ఏ తేదీ విలువను తీసుకున్నారు, నిర్మాణం ఉన్న విస్తీర్ణం ఎంత, అన్న వివరాల్లో పారదర్శకత అవసరం.

మెమో 48030.. మరి 58 సంగతేంటి?

జీవో 59 కింద పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి నెల రోజుల గడువు విధించడం ద్వారా దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం భావిస్తోంది. లబ్ధిదారుల అర్హతలు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని, గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్లను కూడా సమీక్షించాలని మంత్రి ఆదేశించినట్లు వెల్లడైంది. అక్రమాలు జరగకుండా చూడాలని అధికారులను హెచ్చరించడం ఆహ్వానించదగిన పరిణామమే. జీవో 59 కింద పేద, మధ్యతరగతి కుటుంబాలు కూడా లబ్ధిదారులుగా ఉండవచ్చన్నది వాస్తవం. కానీ ఇక్కడే మరో ప్రశ్న ఎదురవుతోంది. జీవో 58 కింద ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని మంజూరయ్యాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వివరాలను ప్రభుత్వం ఎందుకు మండలాలవారీగా వెల్లడించకూడదు, జీవో 59కు ప్రకటించిన తరహాలోనే జీవో 58 పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికీ కాలపరిమితి ప్రకటించాల్సిన అవసరం లేదా.

శివార్లలో 500 గజాల ముక్కల మతలబేంటి?

హైదరాబాద్ నగర విస్తరణతో శివారు మండలాల్లో భూముల విలువ గణనీయంగా పెరిగింది. జిన్నారం, గుమ్మడిదల, గండిమైసమ్మ, బాచుపల్లి, బౌరంపేట, శంకరపల్లి, గండిపేట, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన అత్యంత కీలకంగా మారింది. ముఖ్యంగా పెద్ద విస్తీర్ణంలోని భూములను 500 గజాల చొప్పున ముక్కలుగా చూపించి, వేర్వేరు వ్యక్తుల పేర్లతో దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉందా అన్న అనుమానాలను అధికారులు నివృత్తి చేయాల్సి ఉంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురైదుగురు వ్యక్తుల పేర్లతో పక్కపక్కనే ఉన్న స్థలాలకు దరఖాస్తులు వస్తే వాటి వాస్తవికతను ఎలా నిర్ధారిస్తారు, దరఖాస్తుదారులు నిజంగానే గతంలో అక్కడ నివాసమున్నారా, లేక పాత రికార్డుల పేరుతో కొత్త ఆక్రమణలను క్రమబద్ధీకరించే ప్రయత్నాలకు అవకాశం ఏర్పడుతుందా, ఈ ప్రాంతాల్లో అలాంటి అక్రమాలు జరిగినట్లు నిర్దిష్ట పత్రాధారాలు ఇంకా వెలుగులోకి రానప్పటికీ, వాటిని గుర్తించేందుకు పటిష్ఠమైన పరిశీలన తప్పనిసరి.

పాత దరఖాస్తుల పేరుతో కొత్త ఆటకు అవకాశం ఉందా?

తాజా నిర్ణయం ప్రధానంగా గతంలో సమర్పించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించినదే. ఈ నేపథ్యంలో అసలు దరఖాస్తు ఏ తేదీన నమోదైందన్నది అత్యంత కీలకం. దరఖాస్తు నంబరు, నమోదు రిజిస్టర్, అప్పటి రెవెన్యూ రికార్డులు, ఆక్రమణకు సంబంధించిన ఆధారాలు పరస్పరం సరిపోవాలి. ఒకవేళ పాత దరఖాస్తు ఉన్నట్లు తప్పుడు నమోదు చేసి, కొత్త ఆక్రమణకు చట్టబద్ధత కల్పించే ప్రయత్నం జరిగితే ప్రభుత్వ భూములకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది. అందుకే దరఖాస్తుల అసలు రిజిస్టర్లతో పాటు డిజిటల్ ఎంట్రీలు, వాటిలో జరిగిన మార్పుల వివరాలను సైతం పరిశీలించాలి. దరఖాస్తు సమర్పించిన తేదీకి సంబంధించిన ఆధారాలను ధ్రువీకరించకుండా కేవలం ప్రస్తుతం సమర్పించిన పత్రాల ఆధారంగా నిర్ణయం తీసుకోవడం సమంజసమేనా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది.

తహసీల్దార్ పరిశీలన ఎంత కీలకం?

జీవో 58, 59ల కింద దరఖాస్తుల పరిశీలనలో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకం. సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దారు స్థాయిలో భూమి వివరాలు, దరఖాస్తుదారుల అర్హతలు, స్వాధీన ఆధారాలను ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ఒకే సర్వే నంబరులో అనేక దరఖాస్తులు వస్తే వాటి మధ్య సంబంధాన్ని పరిశీలిస్తున్నారా, క్షేత్రస్థాయిలో భూమిని కొలిచి హద్దులు నిర్ధారిస్తున్నారా, గతంలో ఉన్న నిర్మాణాలు, ప్రస్తుతం కనిపిస్తున్న నిర్మాణాలు ఒకటేనా, భూమి ప్రభుత్వానిదేనా, కోర్టు వివాదాలు, నిషేధాలు ఏమైనా ఉన్నాయా, అన్న అంశాలన్నింటినీ నిర్ధారించాలి. ఒకవేళ అక్రమాలు గుర్తిస్తే వాటికి సహకరించిన అధికారులపైనా బాధ్యత నిర్ణయించాలి. అదే సమయంలో ఎలాంటి ఆధారాలు లేకుండా అధికారులందరినీ అనుమానించడం కాకుండా, ప్రతి నిర్ణయానికి సంబంధించిన రికార్డులను పారదర్శకంగా ఉంచాల్సిన అవసరం ఉంది.

పేదల పేరుతో వచ్చిన అవకాశాలు ఎవరికీ?

జీవో 58 కింద ఉచిత పట్టాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ రూపొందించిందన్నది ఇప్పటికీ స్పష్టత రావాల్సిన అంశం. గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయినప్పటికీ, అప్పటి అర్హతలు కలిగిన పేద కుటుంబాల సమస్యను ఎలా పరిష్కరిస్తారన్నదానిపై కూడా ప్రభుత్వం తన వైఖరి వెల్లడించాలి. అయితే కొత్తగా ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి పాత పథకాల పేరుతో ప్రయోజనం కల్పించకూడదు. నిజమైన పేదవాడికి పట్టా ఇవ్వడం సామాజిక న్యాయం. నకిలీ ఆధారాలతో ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించడం ప్రజా ఆస్తికి నష్టం. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించే బాధ్యత రెవెన్యూ యంత్రాంగానిదే. కేవలం ప్రభుత్వానికి ఆదాయం వస్తుందనే కోణంలో కాకుండా...క్రమబద్ధీకరణ వెనుక ఉన్న సామాజిక లక్ష్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజా ప్రభుత్వానికి ఇదే అసలు పరీక్ష!

ప్రజా ప్రభుత్వమని ప్రకటించుకుంటున్న కాంగ్రెస్ సర్కారు భూ సమస్యల పరిష్కారంలో పేదలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఆచరణలో చూపించాల్సిన అవసరం ఉంది. జీవో 59 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయడంతోపాటు జీవో 58 కింద అర్హులైన పేదల పెండింగ్ దరఖాస్తులకూ ప్రత్యేక గడువు ప్రకటించాలి. రాష్ట్రవ్యాప్తంగా రెండు జీవోల కింద మంజూరైన పట్టాలు, క్రమబద్ధీకరించిన భూముల విస్తీర్ణం, వసూలైన రుసుములు, తిరస్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రజల ముందుంచాలి. ముఖ్యంగా హైదరాబాద్ శివారు మండలాల్లో ఒకే సర్వే నంబరులో ఎక్కువ సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను ప్రత్యేకంగా తనిఖీ చేయాలి. అక్రమాలు నిర్ధారణ అయితే క్రమబద్ధీకరణను నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ భూముల పరిరక్షణతోపాటు అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూడాలి500 గజాల దరఖాస్తుల పరిష్కారానికి నెల రోజుల గడువు ప్రకటించిన ప్రభుత్వం.. 125 గజాల పేదవాడి ఉచిత పట్టాకు ఎప్పుడు గడువు ప్రకటిస్తుందో, జీవో 59తోపాటు జీవో 58కూ సమానమైన ప్రాధాన్యం ఇస్తుందా, పేదల కోసం తీసుకొచ్చిన భూ క్రమబద్ధీకరణ విధానం నిజమైన అర్హులకు చేరేలా చేస్తుందా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలివే.

యాసంగిలో ఆరుతడి పంటలే మేలు

శమొదటి పేజీ తరువాయి

మరోవైపు, తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అసాధారణ స్థాయికి చేరిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సగటు డిమాండ్‌కు అదనంగా మరో 5,000 మెగావాట్ల భారం పడుతోందని, అక్టోబర్ నెలలో ఈ స్థాయిలో విద్యుత్ వాడకం జరగడం గతంలో ఎన్నడూ లేదని వివరించారు. మార్కెట్‌లో ఎంత వ్యయానికైనా విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని, అదనపు విద్యుత్ కేటాయింపుల కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వెల్లడించారు. ఎల్ నినో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు కేంద్రం అండగా నిలవాలని, కేంద్ర ప్రాయోజిత పథకాలలో కేంద్రం వాటాను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.నదీ జలాల పంపిణీ, సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీ వేదికగా



చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన నీటి హక్కులపై సమగ్రంగా చర్చించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నది తమ ఉద్దేశమని పేర్కొన్నారు. అసెంబ్లీకి వచ్చి అంశాలపై చర్చించకుండా బయట విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి అన్నారు. ప్రాజెక్టుల ఖర్చులు, నీటి కేటాయింపులు, గత నిర్ణయాలపై చర్చ జరిగితే ప్రజలకు స్పష్టత వస్తుందని అభిప్రాయపడ్డారు.కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం తెలంగాణకు కీలకమైన అంశం. సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల పూర్తి, రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాపై ప్రభుత్వం సమగ్ర చర్చకు సిద్ధమని గతంలోనూ ప్రకటించింది. తాజాగా రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది. నీటి కేటాయింపులు, ప్రాజెక్టుల వ్యయాలు, గత ప్రభుత్వ నిర్ణయాలపై అధికారిక వివరాలు అసెంబ్లీలో చర్చకు వస్తే ఈ వివాదంలోని పలు అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?

శమొదటి పేజీ తరువాయి

అసైన్డ్ భూముల అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని మహేశ్వర్ రెడ్డి ఆరోపణ

ధరణి, భూ భారతి రెండింటిలోనూ అక్రమాలు కొనసాగుతున్నాయని వ్యాఖ్య

గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై సీబీఐ విచారణకు ఎందుకు వెనుకడుగు అని ప్రశ్న

అధికారిక రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేవలం 42.53 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ భారీ వ్యత్యాసంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం అసైన్డ్ భూముల విక్రయానికి సిద్ధమవుతోందని, ఇది పేద ప్రజలకు తీరని అన్యాయం చేయడమేనని ఆయన విమర్శించారు.గతంలోని ధరణి పోర్టల్ నుంచి నేటి భూభారతి వరకు కేవలం పేర్లు మాత్రమే మారాయని, అక్రమాలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గతంలో న్యాయస్థానం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిన సెక్షన్ 22ఏను, ప్రభుత్వం కొన్ని సవరణలతో నేటికీ కొనసాగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ఆయన



ప్రశ్నించారు. ఈ ఆరోపణలతో తెలంగాణలో భూ రికార్డులు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై రాజకీయ చర్చ మరింత ఊపందుకుంది.

ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి

శమొదటి పేజీ తరువాయి

భూగర్భ జలమట్టాలు పడిపోవడంపై ఆందోళన

తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం

ప్రతి జిల్లాకు నోడల్ అధికారులు

సింగూరు, మంజీరా జలాశయాల నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి

సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు.సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సీఎస్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా రూపొందించిన ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే 15 రోజుల నీటి లభ్యతను అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వాతావరణ మార్పులు పంటలపై చూపే ప్రభావాన్ని వ్యవసాయ, విద్యుత్, సాగునీటి శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు.

నారాయణపేటలో దారుణం

మొదటి పేజీ తరువాయి

నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి దాడి

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి

నేరం అంగీకరించిన నిందితురాలు.. కేసు నమోదు చేసిన పోలీసులు

మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాములమ్మ భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, రాములమ్మ ఈ ఘాతుకానికి పాల్పడింది. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను భర్తపై పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో హాహాకారాలు చేసిన బాలస్వామిని గమనించిన స్థానికులు, చికిత్స నిమిత్తం తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న అతను మృతి చెందాడు.ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, మృతుడి నుంచి సేకరించిన మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాలు ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహిత (దీచీూ) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

తిరుమలలో స్వల్పంగా పెరిగిన భక్తుల రద్దీ

శమొదటి పేజీ తరువాయి

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరాయంగా అన్నప్రసాదం, పాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద తోపులాటలు జరగకుండా భద్రతా సిబ్బందిని నియమించి, రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు.మరోవైపు, బుధవారం రోజున మొత్తం 84,289 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 31,474 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హుండీ ద్వారా స్వామివారికి రూ.3.33 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా

శమొదటి పేజీ తరువాయి

ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.భోత్రా లాజిస్టిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సింగరేణి సంస్థ చేసుకున్న అన్ని రహస్య ఒప్పందాలను బయటపెట్టాలని సీఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన సదరు కంపెనీని ఎంపిక చేశారో సమాధానం చెప్పాలని తెలంగాణ సీఎంను ఈ సందర్భంగా ఆయన నిలదీశారు

22-ఏ నుంచి భూముల తొలగింపునకు

రూ.5 లక్షల లంచం!

◆ ఏసీబీ వలలో కీసర డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో.. ◆ రూ.2.50 లక్షలు తీసుకుంటూ మధ్యవర్తి పట్టివేత! ◆ నిషేధిత జాబితా నుంచి వ్యవసాయ భూముల తొలగింపునకు రూ.5 లక్షల డిమాండ్ ◆ తొలి విడతగా రూ.2.50 లక్షలు స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కిన ప్రైవేటు వ్యక్తి ◆ డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో, మధ్యవర్తిపై కేసు.. దర్యాప్తు చేపట్టిన ఏసీబీ

సామాన్యుడి అస్త్రం / మేడ్చల్--మల్కాజిగిరి :



నిషేధిత భూముల జాబితా నుంచి వ్యవసాయ భూములను తొలగించేందుకు రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో కీసర రెవెన్యూ కార్యాలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు ఏసీబీ వలకు చిక్కారు. డిప్యూటీ తహసీల్దార్ సూచనల మేరకు మధ్యవర్తి ద్వారా లంచం తీసుకునేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. తొలి విడతగా రూ.2.50 లక్షలు స్వీకరిస్తుండగా ప్రైవేటు వ్యక్తిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో కీసర డిప్యూటీ తహసీల్దార్ అమనగంటి సందీప్‌కుమార్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి నన్నూరి విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రైవేటు వ్యక్తి కావలి బాలకృష్ణను నిందితులుగా పేర్కొన్నారు.ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి తల్లి, ఇతర కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చట్టం--1908లోని సెక్షన్ 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయి. ఆ భూములను జాబితా నుంచి తొలగించేందుకు అవసరమైన అధికారిక ప్రక్రియను పూర్తి చేయాలంటే రూ.5 లక్షలు చెల్లించాలని కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తాన్ని ప్రైవేటు వ్యక్తి కావలి బాలకృష్ణ ద్వారా స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఏసీబీ పేర్కొంది.డిప్యూటీ తహసీల్దార్ సూచనల మేరకు వీఆర్వో నన్నూరి విజయ్‌కుమార్‌రెడ్డి సైతం లంచం తీసుకునేలా మధ్యవర్తి బాలకృష్ణను ప్రేరేపించినట్లు ఏసీబీ తెలిపింది. ఈ క్రమంలో గురువారం ఫిర్యాదుదారుడి నుంచి తొలి విడతగా రూ.2.50 లక్షలు స్వీకరిస్తుండగా రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు బాలకృష్ణను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.ప్రభుత్వ రికార్డుల్లో నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యను పరిష్కరించేందుకు లంచం డిమాండ్ చేయడం రెవెన్యూ శాఖలో మరోసారి చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో ముగ్గురినీ నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరుపరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని, ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు వెల్లడించారు.

ఆరు విద్యుత్ మీటర్లకు రూ.1.20 లక్షల లంచం!..

ఏసీబీ వలలో ఏఈ!

◆ఆన్‌లైన్ దరఖాస్తుల ఆమోదానికి భారీ డిమాండ్.. డబ్బులు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన అధికారి!

◆పాత మీటర్ల స్థానంలో ఆరు కొత్త మీటర్ల మంజూరుకు రూ.1.20 లక్షల లంచం

◆ఏసీబీకి చిక్కిన మాదన్నపేట విద్యుత్ ఏఈ పండాల సంధ్యా రాకేష్

◆ లంచం సొమ్ము స్వాధీనం.. నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు నిందితుడు

సామాన్యుడి అస్త్రం / హైదరాబాద్ :

పోయిన విద్యుత్ మీటర్ల స్థానంలో కొత్తవి మంజూరు చేయాలన్నా లంచం ఇవ్వాల్సిందేనా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా అధికారుల చేతులు తడపాల్సిందేనా, ఆరు విద్యుత్ మీటర్ల మంజూరుకు ఏకంగా రూ.1.20 లక్షల లంచం డిమాండ్ చేసి, ఆ మొత్తాన్ని స్వీకరిస్తూ ఓ అసిస్టెంట్ ఇంజినీర్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. హైదరాబాద్ సంతోష్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని మాదన్నపేట టీజీఎస్పీడీసీఎల్ సెక్షన్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్ పండాల సంధ్యా రాకేష్‌ను గురువారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ప్రెస్‌నోట్ నంబరు 156 ద్వారా వివరాలు వెల్లడించింది.ఏసీబీ కథనం ప్రకారం.. ఫిర్యాదుదారుడికి చెందిన గతంలో కనిపించకుండా పోయిన ఆరు విద్యుత్ మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు మంజూరు చేయాల్సి ఉంది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులను ఆమోదించేందుకు అసిస్టెంట్ ఇంజినీర్ సంధ్యా రాకేష్ రూ.1.20 లక్షలు లంచం డిమాండ్ చేశారు. తన పరిధిలోని అధికారిక పనిని పూర్తి చేయడానికి భారీ మొత్తంలో డబ్బులు అడగడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదు నేపథ్యంలో రంగంలోకి దిగిన హైదరాబాద్ సిటీ రేంజ్--2 ఏసీబీ అధికారులు గురువారం వలపన్నారు. ఫిర్యాదుదారుడి నుంచి రూ.1.20 లక్షలు స్వీకరిస్తుండగా ఏఈని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.ప్రజలకు విద్యుత్ సేవలు అందించాల్సిన అధికారి, దరఖాస్తుల ఆమోదం కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడం చర్చనీయాంశమైంది. ఆన్‌లైన్ విధానంలో



దరఖాస్తులు సమర్పించినప్పటికీ వాటి పరిష్కారం కోసం అధికారిని ఆశ్రయించాల్సి రావడం, అదే అవకాశాన్ని లంచం కోసం ఉపయోగించుకున్నట్లు ఏసీబీ పేర్కొనడం గమనార్హం. ఈ వ్యవహారంలో నిందితుడు తన విధులను దుర్వినియోగం చేసి అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు అధికారులు వెల్లడించారు.నిందితుడిని నాంపల్లిలోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాలతో గోప్యంగా ఉంచినట్లు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే గాంధీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరామ్ యాదవ్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ల పంపిణీ



సామాన్యుడి అస్త్రం / కొండాపూర్ :

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, శ్రీరామ్‌నగర్ మాజీ అధ్యక్షుడు బలరామ్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన బలరామ్ యాదవ్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొండాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధుల జన్మదిన వేడుకలను కేవలం శుభాకాంక్షలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని బలరామ్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడంలోనే వేడుకలకు నిజమైన అర్థం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజమోహన్‌రావు, నాగరాజు, రేపల్లె అశోక్, సన్నీ యాదవ్, మాధవ్, వెంకటయ్య, ప్రేమ్, సాయిచరణ్, మల్లికార్జున్, రవితేజ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గాంధీ ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.



శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో బతుకమ్మ సందడి!



సామాన్యుడి అస్త్రం / శేరిలింగంపల్లి :

రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. మహిళల ఆటపాటలు.. సంప్రదాయ గీతాలతో శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం పండుగ శోభను సంతరించుకుంది. గురువారం జోనల్ కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ (ఐఏఎస్) ఆధ్వర్యంలో సీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ), అర్బన్ బయోడైవర్సిటీ (యూబీడీ) విభాగాలు సంయుక్తంగా వేడుకలను ఏర్పాటు చేశాయి. మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. నిత్యం అధికారిక కార్యకలాపాలతో బిజీగా ఉండే కార్యాలయం బతుకమ్మ పాటలతో మార్మోగింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టేలా సాగిన ఈ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు.

కమీషన్ల అడ్డాగా సీఎం ఆఫీస్



మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, అక్టోబర్ 15

తెలంగాణ సీఎం కార్యాలయాన్ని కమీషన్లకు అడ్డాగా మార్చేశారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ పనికి 15 శాతం కమీషన్ కావాలంటూ నేరుగా సీఎంఓ నుంచే బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయమంటూ గురువారం ట్విట్టర్ వేదికగా విమర్శించారు. ఇది ప్రజాపాలన కాదు.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అని తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లో ఈ అరాచకాలను సహించదని హెచ్చరించారు.ప్రజలకు, వ్యాపారులకు రక్షణగా ఉండాల్సిన సీఎం, ఆయన ఆఫీస్ నుంచే ఇలాంటి ఆగడాలు జరగటమేంటనీ ప్రశ్నించారు. ప్రజలను దోచుకుంటూ కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడుతున్న వాళ్లను ఎట్టి పరిస్థితుల్లో వదిలేదని లేదని, తాము అధికారంలోకి వచ్చాక ఈ లూటీకి పాల్పడిన వాళ్లందరిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా రైతుల కోసం మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధంగా 'మహిళా రైతుల సాధికారిత' చట్టాన్ని తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు.

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం



మొదటి పేజీ తరువాయి


నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు

ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు.రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు.నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు.ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేకంగా నీటి సరఫరా..! తీవ్రంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ప్రత్యేక నీటి సరఫరా ఉందంటూ సీఎం ఆగ్రహం
ఈ వ్యవహారంపై విచారణ జరిపించేందుకు సిద్ధమని ప్రకటన
ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర నీటి, విద్యుత్ కొరత తప్పదని వ్యాఖ్య
యాసంగిలో వరి సాగు చేయవద్దని రైతులకు ముఖ్యమంత్రి సూచన
కాళేశ్వరం అవినీతితో లక్ష కోట్ల నష్టం జరిగిందని ఆరోపణ



హైదరాబాద్,అక్టోబర్15(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో ప్రజలు, రైతులు తీవ్ర నీటి ఎద్దడితో సతమతమవుతుంటే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు మాత్రం ప్రత్యేకంగా నీటిని తరలించుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.మంత్రులతో కలిసి రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంపై సమీక్ష నిర్వహించిన అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొండపోచమ్మ సాగర్ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వి, అక్కడి నుంచి ప్రత్యేక మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారని ఆరోపించారు.”రాష్ట్రంలో మరెవ్వరికీ లేని ఈ ప్రత్యేక సౌకర్యం ఒక్క కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మాత్రమే ఎందుకు కల్పించారు? ఈ నీటి తరలింపుపై నిజనిర్ధారణ విచారణ జరిపించడానికి మేము సిద్ధంగా ఉన్నాం” అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్ల కోసం లక్ష కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని, మేడిగడ్డ బ్యారేజీని కూల్చి మళ్లీ నిర్మించాలని కేంద్ర నిపుణులు సూచించారని రేవంత్ రెడ్డి తెలిపారు. 2015లో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు తగ్గించి సంతకాలు చేసింది ఎవరని ఆయన ప్రశ్నించారు. గత దశాబ్ద కాలంలో కృష్ణా బేసిన్‌లో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా? అని ఆయన నిలదీశారు.

ఆ హోటల్ ఆదాయం రోజుకు రూ.75 లక్షలు.. కేటీఆర్‌పై వెంకట్ బల్మూర్ తీవ్ర ఆరోపణ



హోటల్ ఆదాయం రూ.5 కోట్ల నుంచి రూ.175 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్న
మంత్రిగా ఎంఎన్సీలను బెదిరించి వ్యాపారం చేశారని ఆరోపణ
ఆరోపణలపై చర్చకు సిద్ధమని కేటీఆర్‌కు సవాల్

త్వరలో సిరిసిల్ల బాగోతం కూడా బయటపెడతానన్న బల్మూరి

హైదరాబాద్,అక్టోబర్15(సామాన్యుడి అస్త్రం)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై శాసనమండలి ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. గతంలో చెప్పినట్టుగానే కేటీఆర్ చీకటి బాగోతాలను వరుసగా బయటపెడుతూనే ఉంటానని, అందులో భాగంగానే ఆయన హోటల్ వ్యాపారానికి సంబంధించిన కొన్ని విషయాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు. రూ.5 కోట్ల షేర్ విలువ ఉన్న డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయం పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ విషయంపై తాను ఆరా తీయగా విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయని బల్మూర్ అన్నారు. కేటీఆర్ ఐటీ మంత్రిగా, షాడో ముఖ్యమంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బహుళజాతి సంస్థ (వీచీజ)లను బెదిరించి, తమ కంపెనీలకు చెందిన ఫుడ్, ఈవెంట్స్, మీటింగ్స్ వంటివి తన హోటల్‌లోనే నిర్వహించేలా ఒప్పందాలు చేయించుకున్నారని విమర్శించారు. ఈ ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఇది కేటీఆర్, ఆయన టీమ్ చేస్తున్న నయా దందా అని అభివర్ణించారు. ఆ హోటల్ రోజువారీ ఆదాయం సుమారు రూ.75 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారుతాను చేసిన ఆరోపణలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని బల్మూర్ స్పష్టం చేశారు. కేటీఆర్‌కు దమ్ముంటే తన ఆరోపణలపై స్పందించాలని సవాల్ విసిరారు. అంతేకాకుండా, త్వరలోనే కేటీఆర్‌కు సంబంధించిన “సిరిసిల్ల చీకటి బాగోతం” కూడా బయటపెడతానని వెంకట్ బల్మూర్ హెచ్చరించారు.

ఉత్తర తెలంగాణ ప్రజలకు అందనున్న

అత్యాధునిక వైద్యం

వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం
20 నుంచి సాధారణ వైద్య సేవలు ప్రారంభం
డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి..
రూ.1,371 కోట్లతో 24 అంతస్తుల్లో ఆస్పత్రి నిర్మాణం
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన



వరంగల్ (మహబూబాబాద్), అక్టోబర్ 15

వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సమయం వచ్చేసింది. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. దసరా పండగ సందర్భంగా ఓపీ సేవలు అందుబాటులోకి రానున్నాయి.ఈ మేరకు గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి(గురువారం ప్రకటిం చారు. ఆసుపత్రి పనులను మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ బలరాం నాయక్, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కే. ఆర్ నాగరాజు, ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దసరాకు ఓపీ సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.నవంబర్ నెలాఖరు లేదంటే డిసెంబర్ 15 వరకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో ఆస్పత్రిని సందర్శిస్తారని ఆయన వెల్లడించారు. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలతోపాటు, ఆదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని తెలిపారు. కాగా, రూ.1,371 కోట్ల అంచనా వ్యయంతో 24 అంతస్తుల్లో ఈ ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. అత్యాధునిక వైద్య సదుపాయాలను కల్పిస్తున్నారు. ఈ ఆస్పత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రస్తుతం హైదరాబాద్ కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తున్న అనేక మంది రోగులకు వరంగల్‌లోనే మెరుగైన చికిత్సలు అందుబాటులోకి వస్తాయి. ముందుగా ఆస్పత్రిలో ఓపీ సేవలను ప్రారంభించడంతోపాటు దశలవారీగా ఇతర వైద్య విభాగాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
సాగర్ సొసైటీలో వేడుకలకు హాజరు

హైదరాబాద్, అక్టోబర్ 15(సామాన్యుడి అస్త్రం)

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో మాత్రమే బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, విశిష్ట సంస్కృతికి ప్రతీకగా అత్యంత ఘనంగా జరుగుతుందని కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి(పేర్కొన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం, బంజారాహిల్స్ పరిధిలోని సాగర్ సొసైటీలో గురువారం నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. మ్యాప్‌లు చూడండిమహిళలతో కలిసి కాసేపు బతుకమ్మ ఆడారు. బతుకమ్మ అంటేనే ఆటపాటల సమ్మేళనమని, పూలను పూజించే అద్భుతమైన సంస్కృతి మనదని కొనియాడారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు, ఆడపడుచులకు ప్రధాని నరేంద్ర మోదీ, చింతల రామచంద్రారెడ్డి తరఫున శుభాకాంక్షలు ప్రకటించారు. ప్రజలందరికీ ఎలాంటి కష్టాలు లేకుండా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సంతోషాలు ప్రసాదించాలని గౌరమ్మ తల్లిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా, దేశానికి నిరంతరం సేవలందిస్తున్న మోదీ పూర్ణాయుష్షుతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా ఆ తల్లి దీవించాలని వేడుకున్నారు.

ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించండి



వ్యవసాయానికి కీలకమైన సమయం
నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలి
నీటి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలి
తాగునీటికి ముందస్తు ఏర్పాట్లు చేయాలి
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
సంగారెడ్డి జిల్లా అధికారులతో సీఎస్ సమీక్ష

సంగారెడ్డి అక్టోబర్ 15 (సామాన్యుడి అస్త్రం)

రానున్న రోజులు పంటల సం రక్షణకు కీలకమైన సమయమని, వ్యవసా య..విద్యుత్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. ఎల్ నినో ప్రభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మ్యాప్‌లు చూడండిఎల్ నినో ప్రభావంతో నీటి లభ్యత, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం సీఎస్ సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. సింగూరు జలాశయంలో నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో టాన్స్‌కో సీఎండీ జితేష్ వి.పాటిల్, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో తాగునీటి సరఫరా ప్రత్యామ్నాయాలపై చర్చించారు. సింగూరు జలాశయ నీటిమ ట్టం, జిల్లాలో తాగునీటి లభ్యత, వర్షపాతం, పంటల సాగు పరిస్థితులు, తాగునీటి సరఫరా ప్రణాళికల గురించి కలెక్టర్ ప్రతీక్ జైన్ సీఎస్‌కు వివరించారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. అగ్రిమెంటేషన్ అవసరమైన పనులన్నింటినీ నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.రానున్న రోజులు పంటల రక్షణకు అత్యంత కీలకమని, వ్యవసాయ అధికారులు రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాజరిగేలా చూడాలన్నారు. ఆరుతడి, స్వల్పకాలిక పంటలను సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులు, నీటి నిల్వ కుంటల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని తెలిపారు.

సాగు నీరు లేదు.. సరిగ్గా కరెంట్ లేదు

ఎల్ నినో వేళ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
సమస్యలను పక్కనబెట్టి 'ఓట్ చోరీ' డ్రామాలు
కలాం సేవలను కాంగ్రెస్ కించపరిచింది
బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు విమర్శలు



హైదరాబాద్, అక్టోబర్ 15(సామాన్యుడి అస్త్రం)

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగు నీటి సమస్య, విద్యుత్ కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావువిమర్శించారు. సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా కాంగ్రెస్ నేతలు 'ఓట్ చోరీ' అంటూ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మ్యాప్‌లు చూడండిఈ కార్యక్రమానికి రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. బోర్లపై ఆధారపడి సాగు చేసే రైతులకు రోజుకు కనీసం రెండు గంటల పాటు కూడా నాణ్యమైన విద్యుత్ అందడం లేదని ఆరోపించారు. గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ విద్యుత్ కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. 22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో ప్రజలను ఆందోళనకు గురిచేస్తూ అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.రాష్ట్ర సమస్యలను పరిష్కరించడం చేతగాని కాంగ్రెస్ నేతలు.. ఢిల్లీ వెళ్లి 'ఓట్ చోరీ' అంటూ రాద్ధాంతం చేస్తున్నారని రాంచందర్ రావు విమర్శించారు. అధికారులు తన మాట వినడం లేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం పాలనలోని పరిస్థితికి నిదర్శనమని ఆయన అన్నారు. గాంధీ అనే పేరుతో వీరికి ఎటువంటి సంబంధం లేదని, రాహుల్, ప్రియాంక, సోనియా.. వీరంతా గాంధీ పేరు ను అక్రమంగా వాడుకుంటున్న 'నకిలీ గాం ధీలు' అని ఎద్దేవా చేశారు.దేశంలో అంతర్గత కల్లోలాలకు విదేశాల నుంచి నిధులు వస్తున్నాయంటూ అమెరికాకు చెందిన ఓ గాయని చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాడు సీఏఏ వ్యతిరేక ఉద్యమం పేరిట షహీన్ బాగ్‌ను నెలరోజుల పాటు దిగ్బంధించి దేశద్రోహ శక్తులకు కాంగ్రెస్ వత్తాసు పలికిందని, అమెరికా అధ్యక్షుడి పర్యటన వేళ దేశ పరువు తీసేలా అల్లర్లకు ఆజ్యం పోసిన చరిత్ర వీరిదని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖలోని 11.4 లక్షల మంది ఉద్యోగులకు 78 రోజుల బోనస్ కింద రూ.2,009.61 కోట్లు మం జూరు చేయడంపై రాంచందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగుల పెన్షన్‌కు గతంలో 80 శాతంగా ఉన్న అర్హతను 40 శా తానికి తగ్గించడం ద్వారా మరింత మందికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.సామాన్య కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం తన ప్రతిభతో దేశ అత్యున్నత పదవి ని అలంకరించడమే కాకుండా, రక్షణ రంగంలో కీలక సేవలందించారని కొనియాడారు. అయితే కలాం సేవలను, అణు పరీక్షలను కాంగ్రెస్ పార్టీ కించపరిచిందని, నాడు పార్లమెంటులో సోనియాగాంధీ, చిదంబరం వంటి నేతలు కలాంను 'బాంబ్ మ్యాన్' అంటూ హేళన చేశారని పేర్కొన్నారు. యువత కలాంను ఆదర్శంగా తీసుకుని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావా లని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వైట్ కేన్ డే సందర్భంగా బీజేపీ దివ్యాంగుల సెల్ ఆధ్వర్యంలో దృష్టిలోపం ఉన్న పలువురికి వైట్ కేన్ స్టిక్స్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా, దివ్యాంగుల సెల్ నాయకులు, పార్టీ ప్రతినిధులుపాల్గొన్నారు.

సింగరేణిపై శ్రీధర్‌బాబు కీలక ప్రకటన



సింగరేణి ప్రైవేటీకరణకు ఛాన్స్ లేదు.. మంత్రి స్ట్రాంగ్ కౌంటర్!"

హైదరాబాద్: (సామాన్యుడి అస్త్రం)

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు() స్పష్టం చేశారు. సింగరేణిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. సంస్థ భవిష్యత్తుపై కార్మికులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అంశాలపై ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ(పాలనపై శ్రీధర్‌బాబు తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. ఆ సమయంలో కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని, సంస్థపై భారీ బకాయిల భారం పడిందని విమర్శించారు. గతంలో సంస్థను దెబ్బతీశారని ఆరోపించిన నాయకులే ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.మ్యాప్‌లు చూడండిసింగరేణి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రతిపక్షాలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. ఇలాంటి ప్రచారాన్ని కార్మికులు, ప్రజలు నమ్మవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని కాపాడిందని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం కూడా సంస్థ ప్రయోజనాలను రక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అంశాలపై ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తుందని భరోసా ఇచ్చారు. ఇదే సమావేశంలో గురించి కూడా శ్రీధర్‌బాబు కీలక హామీ ఇచ్చారు. ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఆధారాలు లేని ఆరోపణలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించబోమని హెచ్చరించారు. సింగరేణి భవిష్యత్తు, కార్మికుల సంక్షేమం, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై మంత్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



యూపీహెచ్సీలకు అభివృద్ధికి కృషి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన కేంద్ర మంత్రి

హైదరాబాద్,అక్టోబర్15(సామాన్యుడి అస్త్రం)

: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్సీ) మౌలిక వసతుల అభివృద్ధి, మెరుగైన వైద్య సేవల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి() తెలిపారు. గురువారం కవాడిగూడలోని డీబీఆర్ మిల్స్ యూపీహెచ్సీతో పాటు ముషీరాబాద్ మెయిన్ రోడ్డులోని యూపీహెచ్సీ, మెట్టుగూడలోని ఆరోగ్య కేంద్రాలను ఆయన సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు.ఆయా కేంద్రాలకు అవసరమైన వైద్య పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఈసీజీ యంత్రంతో కూడిన బెడ్లు తదితర పరికరాలను సమకూర్చారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భరత్ గౌడ్, రమేష్ రామ్, జి. వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ యూపీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తమిళనాడుతో తెలంగాణకున్నది పోటీ కాదు



2 రాష్ట్రాలూ కలిసి పని చేస్తే దక్షిణ భారతం మరింత బలోపేతం
ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-26 రోడ్‌షోలో శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబరు 15(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు పారిశ్రామిక రంగంలో పరస్పరం పోటీపడే రాష్ట్రాలు కావని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రెండు రాష్ట్రాలు కలిసి పని చేస్తే దక్షిణ భారతదేశం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని తమిళనాడు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సహకారంతో చెన్నైలో గురువారం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' రోడ్‌షోలో శ్రీధర్ బాబు ఉపన్యసించారు. పారిశ్రామిక రంగంలో తమిళనాడు సాధించిన ప్రగతిని ప్రస్తావించిన శ్రీధర్‌బాబు.. ఆ రాష్ట్రం నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఇంజనీరింగ్ విద్య, ఆటోమొబైల్ తయారీ, ఎలక్ట్?ట్రానిక్స్ ఉత్పత్తి, విద్యుత్ వాహనాల తయారీలో తమిళనాడు దేశానికి ఆదర్శమని కొనియాడారు. తమిళనాడుకు తనదైన బలాలు ఉన్నాయని, తెలంగాణకు ప్రత్యేక అవకాశాలు ఉన్నాయని.. రెండు రాష్ట్రాలు కలిసి పని చేస్తే దక్షిణ భారతదేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కోయంబత్తూరు, తిరుప్పూర్ పర్యటనల సందర్భంగా అక్కడి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పనితీరును దగ్గరగా పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా డిసెంబరు 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్‌సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు నిర్ణీత సమయంలో అనుమతులు ఇచ్చేందుకు టీజీ-ఐపాస్ విధానం అందుబాటులో ఉందన్నారు. తమిళనాడు పారిశ్రామిక వేత్తలకు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని వివరించారు.

2 లక్షల మందితో హైదరాబాద్‌లో

భారీ బహిరంగ సభ

దసరా తర్వాత నిర్వహిస్తాం
ఓట్-చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన
ఎమ్మెల్సీ ఎన్నికలపై 23న సీఎం సమావేశం: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 14 (సామాన్యుడి అస్త్రం)

: ఓట్ చోరీని నిరసిస్తూ దసరా తర్వాత.. హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో భారీ మార్చ్, బహిరంగ సభను నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ వెల్లడించారు. దక్షిణాదిన రెండు రాష్ట్రాల్లో ఈ సభలను నిర్వహించాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించిందని, అందులో ఒకటి హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బుధవారం, గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పోరాటం చేసినా వారికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు రాహుల్‌గాంధీ స్వయంగా షూ లేస్ కట్టారని గుర్తు చేస్తూ.. అంతటి ఉన్నత వ్యక్తిత్వం ఉన్న నేత మహిళా జర్నలిస్టులను అవమానించారంటూ కొందరు చవకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



రాజకీయాల కోసం మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు.అయోధ్య రామ మందిర నిర్మాణానికి భూమి పూజ చేసిందే రాజీవ్‌గాంధీ అని స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దేశం ప్రమాదంలో పడిందని, సంపన్నులకు రూ. లక్షల కోట్ల రుణాల మాఫీ జరగగా.. సామాన్యులకు మాత్రం ఒరిగిందేమీ లేదని విమర్శించారు. 15 ఏళ్లుగా నిలిచిపోయిన ఆర్టీసీ కార్మిక సంఘాలకు ఎన్నికలను తమ ప్రభుత్వం పునరుద్ధరించిందని, కార్మికుల శ్రేయస్సుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. త్వరలో జరగబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 23న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్నట్లు వెల్లడించారు. పార్టీలో కష్టపడ్డవారికి న్యాయం చేసే ఉద్దేశంతోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ఆలస్యం అవుతోందని, దసరాకు అటు, ఇటుగా దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. ఎర్రవల్లిలో 45 ఎకరాల భూమి ఎవరి కబ్జాలో ఉందనే అంశంపై విచారణ జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న సింగరేణి గర్జనకు అర్థంలేదని, కేసీఆర్ పదేళ్లపాటు సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి టైంపాస్ చేశారని విమర్శించారు.

సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి: సీఎం చంద్రబాబు

విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి, సీఎం
మహిళాశక్తికి రాష్ట్రపతి ముర్ము స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు
గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ గుర్తింపు తేవడమే మేళా ఉద్దేశం
డ్వాక్రా సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని వెల్లడి
త్వరలో డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లు కావాలన్న సీఎం



అమరావతి,అక్టోబర్15(సామాన్యుడి అస్త్రం)

విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 'జాతీయ సరస్ మేళా' వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో ఈ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ తర్వాత తొలిసారిగా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం మహిళలందరికీ ఆదర్శమని కొనియాడారు. మహిళలు సంకల్పిస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ముర్ము నిరూపించారని ప్రశంసించారుమహిళా శక్తిని చాటేందుకే విజయవాడలో ఈ మేళాను ఏర్పాటు చేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 650 స్టాళ్లు మహిళల నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ ఉత్పత్తులు జాతీయ ఉత్పత్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా ఒక చరిత్ర సృష్టిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం డ్వాక్రా సంఘాలు రూ.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుంటూ, లక్ష కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయని, త్వరలోనే ఇది రూ.10 లక్షల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. త్వరలోనే పది లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆరు కోట్ల మందిని వ్యాపారవేత్తలుగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆయన స్ఫూర్తి ప్రశంసనీయమని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తమ ఆశయమని సీఎం స్పష్టం చేశారు.

విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం



శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తుడు దుర్గా శ్రీనివాస్ సమర్పణ
494 గ్రాముల బంగారంతో నవరత్నాలతో కిరీటం తయారీ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత

అమరావతి,అక్టోబర్15(సామాన్యుడి అస్త్రం)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు.వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు.దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

ప్రియుడి బెయిల్ కోసం డ్రగ్స్ క్యారియర్‌గా మారిన యువతి.. విజయవాడలో అరెస్ట్

విజయవాడ రైల్వే స్టేషన్‌లో డ్రగ్స్‌తో పట్టుబడ్డ నాగసౌమ్య
జైల్లో ఉన్న ప్రియుడి బెయిల్ డబ్బుల కోసం కమీషన్‌కు ఒప్పుకున్నట్లు వెల్లడి
బెంగళూరు నుంచి 110 గ్రాముల ఎండీఎంఏ తీసుకొస్తుండగా అరెస్ట్
తప్పించుకున్న ప్రధాన నిందితుడు బషీర్‌ను కూడా పట్టుకున్న పోలీసులు



అమరావతి,అక్టోబర్15(సామాన్యుడి అస్త్రం)

జైలులో ఉన్న తన ప్రియుడికి బెయిల్ ఇప్పించేందుకు అవసరమైన డబ్బు సమకూర్చుకునే క్రమంలో డ్రగ్స్ సరఫరా చేస్తూ ఓ యువతి పోలీసులకు పట్టుబడింది. విజయవాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి ఆమెను అరెస్ట్ చేసిన పోలీసులు, ఆమె వద్ద నుంచి 110 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. విజయవాడ పటమటకు చెందిన నాగసౌమ్యకు మాదక ద్రవ్యాల అలవాటు ఉంది. ఆమె ప్రియుడు కాశీవర్ధన్ మూడు నెలల క్రితం డ్రగ్స్ సరఫరా కేసులో చిత్తూరులో అరెస్టయి ప్రస్తుతం జైలులో ఉన్నాడు. అతడి బెయిల్ కోసం అవసరమైన నగదు లేకపోవడంతో, నాగసౌమ్య డ్రగ్స్ క్యారియర్‌గా మారాలని నిర్ణయించుకుంది.విజయవాడ కృష్ణలంకకు చెందిన డ్రగ్స్ సరఫరాదారు బషీర్, బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొస్తే రూ. 50 వేల కమిషన్ ఇస్తానని నాగసౌమ్యను ప్రలోభపెట్టాడు. దీంతో ఈ నెల 13న ఆమె బెంగళూరులోని యలహంకకు వెళ్లి, అక్కడ ఓ గుర్తుతెలియని వ్యక్తి నుంచి రెండు ప్యాకెట్లలో ఉన్న 110 గ్రాముల ఎండీఎంఏను తీసుకుంది. అనంతరం బెంగళూరు–హౌరా ఎక్స్‌ప్రెస్ రైలులో విజయవాడకు బయలుదేరింది.ముందస్తు సమాచారంతో ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ రమణ బృందాలు విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిఘా ఉంచాయి. రైలులో పోలీసుల తనిఖీలను గమనించిన నాగసౌమ్య, ఈ విషయాన్ని బషీర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో అతడు స్టేషన్ నుంచి పరారయ్యాడు. పోలీసులు నాగసౌమ్యను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఆమె ప్యాంటు లోపల ప్రత్యేకంగా కుట్టించుకున్న జేబులో దాచిన డ్రగ్స్ ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న బషీర్‌ను కూడా బుధవారం విజయవాడలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

స్థానిక ఎన్నికల్లోనూ కలిసే బరిలోకి.. టీడీపీ-జనసేన మధ్య సీట్ల సర్దుబాటు పూర్తి



స్థానిక ఎన్నికలపై టీడీపీ-జనసేన చర్చలు సఫలం
2024 తరహాలోనే కలిసే పోటీకి నిర్ణయం
రెండు రోజుల్లో ఉమ్మడి అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామన్న నేతలు
2029 ఎన్నికల్లోనూ పొత్తు కొనసాగుతుందని స్పష్టం

అమరావతి,అక్టోబర్15(సామాన్యుడి అస్త్రం)

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు విజయవంతంగా ముగిసినట్లు జనసేన నేతలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ యాదవ్, చిల్లపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో బుధవారం రాత్రి జనసేన విప్ పి. హరిప్రసాద్, మరో నేత పెండెం దొరబాబుతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, 2024 అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితోనే బరిలోకి దిగుతామని వారు స్పష్టం చేశారు.కేవలం గెలుపు అవకాశాలనే ప్రామాణికంగా తీసుకుని సీట్ల కేటాయింపు జరిగిందని వారు తెలిపారు. సీట్ల సంఖ్య కంటే విజయమే తమకు ముఖ్యమని పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో ఏ పార్టీ ఎక్కడెక్కడ పోటీ చేస్తుందనే వివరాలతో పాటు, ఉమ్మడి అభ్యర్థుల జాబితాను కూడా విడుదల చేస్తామని వెల్లడించారు. ఇరు పార్టీల కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.2024 ఎన్నికల్లో ప్రజలు కూటమిని విశ్వసించి ఓటేశారని, ఆ తీర్పును తాము గౌరవిస్తామని నేతలు పేర్కొన్నారు. కూటమిలో విభేదాలు ఉన్నాయంటూ సాగుతున్న ప్రచారానికి తావు ఇవ్వకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇదే పొత్తు 2029 ఎన్నికల్లోనూ కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనలకు అనుగుణంగానే సీట్ల సర్దుబాటు జరిగిందని నేతలు వివరించారు.

జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలు



జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైసీపీ అభ్యర్థన
నామినేషన్ల ప్రక్రియ స్వేచ్ఛగా జరగాలంటున్న పిటిషనర్
కేవలం అనుమానాలతో ఆదేశాలివ్వలేమన్న ఈసీ, ప్రభుత్వం
ఇతర రెండు పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

అమరావతి,అక్టోబర్15(సామాన్యుడి అస్త్రం)

స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వాదనలు ముగిశాయి. ప్రతి జిల్లా కేంద్రంలో ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. బుధవారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది వీరా రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సాధారణ నామినేషన్ కేంద్రాలు సరిపోవని, అభ్యర్థుల భద్రత దృష్ట్యా ప్రతి జిల్లా కేంద్రంలో అదనపు కేంద్రాలు అవసరమని కోర్టుకు విన్నవించారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించినా ఎలాంటి స్పందన రాలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాల శ్రీనివాస్, ఎన్నికల సంఘం తరపున న్యాయవాది అశ్విని కుమార్ వాదనలు వినిపించారు. నామినేషన్ల దాఖలుకు మూడు రోజుల సమయం ఉంటుందని, ఎవరైనా అడ్డుకుంటే ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉందని తెలిపారు. కేవలం అనుమానాల ప్రాతిపదికన న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయలేదని వారు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రాల్లో నామినేషన్ కేంద్రాల ఏర్పాటు అనేది ఎన్నికల అధికారి విచక్షణకు లోబడి ఉంటుందని, ప్రస్తుత నిబంధనల్లో దానికి అవకాశం లేదని వివరించారు. ఇప్పటికే నామినేషన్, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కోర్టుకు నివేదించారు.ఇదే సమయంలో, స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలని, కుల ధ్రువీకరణ, నిరభ్యంతర పత్రాలను సకాలంలో జారీ చేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన మరో రెండు పిటిషన్లపై విచారణను జస్టిస్ వి. సుజాత గురువారానికి వాయిదా వేశారు.

అరగంట కఠిన వ్యాయామం చేసినా క్యాన్సర్ ముప్పు

కదలికలు తగ్గితే కండరాల బలం, జీవక్రియలపై ప్రభావం పడొచ్చంటున్న వైద్యులు

అధిక బరువు కనీసం 13 రకాల క్యాన్సర్ల ముప్పుతో సంబంధం కలిగి ఉందని వెల్లడి

పెద్దపేగు, కాలేయం, రొమ్ము క్యాన్సర్లు ప్రమాదం ఉందంటున్న డాక్టర్లు

పెద్దలు వారానికి 150-300 నిమిషాల మితమైన వ్యాయామం చేయాలని సూచన

పని మధ్యలో లేచి నడవడం, సాగదీత వ్యాయామాలు చేయడం మంచిదని సలహా



రోజూ అరగంట వ్యాయామం చేస్తున్నారు.. మిగతా సమయమంతా ఆఫీసులో కుర్చీకి, ఇంట్లో సోఫాకు అతుక్కుపోతున్నారా? అయితే మీ ఆరోగ్యంపై మరోసారి దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజూ వ్యాయామం చేయడం మంచిదే అయినా, రోజులో ఎక్కువ గంటలు కదలకుండా కూర్చోవడం వల్ల కలిగే ప్రమాదాలను అది పూర్తిగా తొలగించలేదని చెబుతున్నారు. శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు కలిసి జీవక్రియల్లో మార్పులకు దారితీయడంతో పాటు కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పును పెంచవచ్చని వివరిస్తున్నారు. ఎక్కువసేపు కదలకుండా ఉండటం వల్ల కండరాల బలం తగ్గడం, శరీర భంగిమ దెబ్బతినడం, రక్తంలో చక్కెర స్థాయుల నియంత్రణలో ఇబ్బందులు తలెత్తవచ్చని డాక్టర్లు తెలిపారు.

అధిక బరువుతో క్యాన్సర్ ముప్పు ఎలా?

శరీరంలో కొవ్వు కేవలం శక్తిని నిల్వ చేయడానికే పరిమితం కాదు. అది హార్మోన్లపై ప్రభావం చూపడంతో పాటు శరీరంలో ఇన్ఫ్లమేషన్ సంబంధిత ప్రక్రియలను ప్రేరేపించవచ్చు. అధిక కొవ్వు వల్ల ఇన్సులిన్ నిరోధకత పెరిగి, కణాల పెరుగుదలను ప్రభావితం చేసే మార్పులు చోటుచేసుకోవచ్చు. మెనోపాజ్ తర్వాత అధిక కొవ్వు కణజాలం నుంచి ఈస్ట్రోజెన్ ఎక్కువగా ఉత్పత్తి కావడం కూడా రొమ్ము, గర్భాశయ అంతర్గత పొర క్యాన్సర్ల ముప్పుతో సంబంధం కలిగి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.అధిక శరీర బరువుకు కనీసం 13 రకాల క్యాన్సర్లతో సంబంధం ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. వీటిలో పెద్దపేగు, మూత్రపిండాలు, కాలేయం, క్లోమం, అండాశయాలు, థైరాయిడ్, రొమ్ము క్యాన్సర్లు ఉన్నాయి. అయితే అధిక బరువు ఉన్న ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ వస్తుందని దీని అర్థం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రోజంతా కదలిక ఉండాలి

పెద్దలకు వారానికి 150-300 నిమిషాల మితమైన వ్యాయామం లేదా 75-150 నిమిషాల తీవ్ర వ్యాయామం ఉపయోగకరమని వైద్యులు సూచిస్తున్నారు. వేగంగా నడవడం, సైక్లింగ్, ఈత వంటి కార్యకలాపాలు ఇందులో భాగం కావచ్చు. అయితే వ్యాయామ సమయంతో పాటు రోజంతా కదలికను కొనసాగించడం కూడా ముఖ్యమే.ఎక్కువసేపు కూర్చొని పనిచేసేవారు మధ్యమధ్యలో లేచి నడవాలి. ఫోన్‌లో మాట్లాడేటప్పుడు నిలబడటం, వీలైతే మెట్లు ఎక్కడం, పని మధ్యలో సాగదీత వ్యాయామాలు చేయడం అలవాటు చేసుకోవాలి. గంటల తరబడి ఒకే చోట కూర్చోకుండా చిన్న విరామాలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.పొగాకు వాడకాన్ని నివారించడం, మద్యానికి దూరంగా ఉండటం, పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, వయసు, వ్యక్తిగత ముప్పును బట్టి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవడం కూడా నివారణలో భాగమే. ఒక్క అలవాటుతో క్యాన్సర్‌ను పూర్తిగా నివారించలేమని, అయితే రోజువారీ జీవనశైలిలో చిన్న మార్పులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ఉపవాసం.. షుగర్ ఉన్నవాళ్లు చేయొచ్చా?

ఇన్సులిన్ వాడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

షుగర్ తగ్గినా, పెరిగినా ప్రమాదమేనని హెచ్చరిక

ఉపవాస సమయంలో గ్లూకోజ్ పరీక్షలు అవసరమని సూచన

తల తిరగడం, వణుకు వస్తే ఉపవాసం ఆపాలని హితవు

వైద్యుడి సలహా తీసుకున్న తర్వాతే ఉపవాసం ప్రారంభిస్తే మేలు



నవరాత్రి ఉత్సవాలు, పండుగలు, ప్రత్యేక శుభసందర్భాల్లో చాలామంది ఉపవాసం ఉంటారు. కొందరు రోజంతా ఆహారం తీసుకోకుండా ఉంటే.. మరికొందరు పండ్లు, పాలు, తేలికపాటి ఆహారంతో సరిపెట్టుకుంటారు. అయితే మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారికి ఉపవాసం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. ఎందుకంటే ఆహారం తీసుకునే సమయం, పరిమాణం మారితే రక్తంలో చక్కెర స్థాయిలు కూడా మారవచ్చు. మందులు వాడుతున్నవారిలో ఈ మార్పులు కొన్నిసార్లు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.అయితే షుగర్ ఉన్నవారంతా ఉపవాసానికి దూరంగా ఉండాలా? లేదా కొందరు వైద్యుల సలహాతో చేయవచ్చా? ఉపవాసం చేయాలని నిర్ణయించుకుంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

షుగర్ ఉన్నవాళ్లు ఉపవాసం చేయవచ్చా?

దీనికి అందరికీ వర్తించే ఒక సమాధానమంటూ లేదు. మధుమేహం రకం, రక్తంలో చక్కెర నియంత్రణ, వాడుతున్న మందులు, గతంలో షుగర్ బాగా తగ్గిన సందర్భాలు, ఇతర ఆరోగ్య సమస్యలు వంటి అంశాలపై ఉపవాసం సురక్షితమా? కాదా? అనేది ఆధారపడి ఉంటుంది.టైప్-1 డయాబెటిస్ ఉన్నవాళ్లు, ఇన్సులిన్ తీసుకునేవారు, తరచూ షుగర్ పడిపోయే సమస్య ఎదుర్కొనేవారు, మూత్రపిండాలు లేదా గుండె సంబంధిత సమస్యలున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. గర్భిణుల్లో మధుమేహం ఉన్నా ఉపవాసం విషయంలో ప్రత్యేక వైద్య సలహా అవసరం. ఇలాంటి వారు స్వయంగా నిర్ణయం తీసుకోకుండా ముందుగా వైద్యుడిని సంప్రదించాలి.మధుమేహం నియంత్రణలో ఉండి, ఇతర సమస్యలు లేని కొందరు వైద్యుల పర్యవేక్షణలో ఉపవాసం చేయగలిగినా.. అది అందరికీ సురక్షితమని భావించకూడదు.

ఉపవాసం చేస్తే షుగర్ స్థాయుల్లో ఎలాంటి మార్పులొస్తాయి?



ఆహారం తీసుకోకుండా ఎక్కువసేపు ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయి తగ్గిపోవచ్చు. ముఖ్యంగా ఇన్సులిన్, కొన్ని రకాల షుగర్ మందులు వాడేవారిలో ఈ ప్రమాదం ఎక్కువ. చెమటలు పట్టడం, చేతులు వణకడం, గుండె వేగంగా కొట్టుకోవడం, ఆకలి, తల తిరగడం, గందరగోళం వంటి లక్షణాలు కనిపించవచ్చు.మరోవైపు మందులు సరిగా తీసుకోకపోవడం, ఉపవాసం విరమించిన తర్వాత ఒకేసారి ఎక్కువ ఆహారం తినడం వల్ల షుగర్ స్థాయిలు పెరగొచ్చు. నీళ్లు తక్కువగా తాగితే డీహైడ్రేషన్ సమస్య కూడా రావచ్చు. ముఖ్యంగా టైప్-1 డయాబెటిస్ ఉన్నవారిలో ఇన్సులిన్ మోతాదును తగ్గించడం లేదా మానేయడం వల్ల డయాబెటిక్ కీటోఅసిడోసిస్ అనే తీవ్రమైన సమస్య తలెత్తవచ్చు.

ఉపవాసం చేయాలనుకుంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ముందుగానే వైద్యుడిని సంప్రదించండి. ఉపవాసం చేయవచ్చా? ఎంతసేపు చేయవచ్చు? మందుల సమయాల్లో మార్పులు అవసరమా? అనే విషయాలను తెలుసుకోండి. షుగర్ మందులు లేదా ఇన్సులిన్ మోతాదును స్వయంగా తగ్గించడం, మానేయడం ప్రమాదకరం. ఉపవాస సమయంలోనూ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను గమనించండి. గ్లూకోజ్ పరీక్ష కోసం వేలికి సూది గుచ్చడం ఉపవాసాన్ని కొనసాగించడానికి అడ్డంకి కాకూడదనే విషయాన్ని మీ వైద్యుడితో చర్చించండి.నీళ్లు తాగకుండా ఉండే ఉపవాసం చేస్తే డీహైడ్రేషన్ ప్రమాదం పెరుగుతుంది. ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యుడి సూచనలు పాటించండి. ఒకేసారి ఎక్కువ ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకుండా సమతుల ఆహారం తీసుకోండి.

ఎప్పుడు ఉపవాసం ఆపేయాలి?

షుగర్ స్థాయి 70 ఎమ్జీ/డీఎల్ కంటే తగ్గినా, చాలా ఎక్కువగా ఉన్నా లేదా చెమటలు పట్టడం, వణుకు, తల తిరగడం, తీవ్రమైన నీరసం వంటి లక్షణాలు కనిపించినా ఉపవాసాన్ని కొనసాగించకూడదు. గందరగోళం, స్పృహ కోల్పోవడం, వాంతులు లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలుంటే అత్యవసర వైద్యసాయం తీసుకోవాలి. ఉపవాసం ఆపాల్సిన నిర్దిష్ట పరిమితులను ముందుగానే వైద్యుడితో నిర్ణయించుకోవడం మంచిది. గమనిక: ఈ సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. వైద్యుల సలహాలుగా భావించొద్దు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా, ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నా కచ్చితంగా వైద్యులను సంప్రదించాలి.

గర్భిణులు నవరాత్రి ఉపవాసం చేస్తున్నారా?



గర్భధారణ సమయంలో నవరాత్రి ఉపవాసాలపై వైద్యుల హెచ్చరిక

దీర్ఘకాలిక ఉపవాసం, పోషకాహార లోపం తల్లి, బిడ్డల ఆరోగ్యానికి ముప్పు

ఉపవాసానికి ముందు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని నిపుణుల సూచన

పాలు, పండ్లు, నట్స్ తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సురక్షితం

దేశవ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ తొమ్మిది రోజుల పాటు చాలామంది భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు పాటిస్తారు. అయితే, గర్భవతులు ఇలా ఉపవాసం ఉండటం సురక్షితమేనా? కడుపులోని బిడ్డపై దీని ప్రభావం ఎలా ఉంటుంది? అనే సందేహాలు సర్వసాధారణం. ఈ నేపథ్యంలో వైద్యులు, ఆరోగ్య నిపుణులు పలు కీలక సూచనలు చేస్తున్నారు. భక్తి ముఖ్యమే అయినా, గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డల ఆరోగ్యం అంతకంటే ప్రధానమని స్పష్టం చేస్తున్నారు.

ఒక్క పూట భోజనం మానడం ప్రమాదమా?

గర్భధారణ సమయంలో ఒక పూట భోజనం మానేసినంత మాత్రాన కడుపులోని బిడ్డకు పోషకాలు అందకుండా పోతాయని లేదా వెంటనే హాని జరుగుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మన శరీరంలో శక్తిని నిల్వ ఉంచుకునే వ్యవస్థ ఉంటుంది. కాబట్టి, స్వల్పకాలికంగా ఆహారం తీసుకోకపోతే శరీరం ఆ నిల్వలను ఉపయోగించుకుంటుంది. అయితే, సమస్య ఇక్కడితో ఆగిపోదు. పదేపదే ఆహారం తక్కువగా తీసుకోవడం, పోషకాలు లేని ఆహారంతో ఉపవాసం చేయడం, ఎక్కువ గంటల పాటు నీళ్లు కూడా తాగకుండా ఉండటం వంటివి గర్భధారణ సమయంలో ప్రమాదకరంగా మారతాయి. గర్భంతో ఉన్నప్పుడు శరీరానికి సాధారణం కంటే ఎక్కువ పోషకాలు, శక్తి అవసరమవుతాయి. సుదీర్ఘ ఉపవాసాలు ఈ అవసరాలను తీర్చడంలో ఆటంకం కలిగిస్తాయి.

పోషకాహార లోపం, డీహైడ్రేషన్ ముప్పు

నవరాత్రి ఉపవాసాల్లో చాలామంది బంగాళాదుంపలు, సగ్గుబియ్యం వంటి వాటిని ఎక్కువగా తీసుకుంటారు. వీటి ద్వారా పిండిపదార్థాలు (కార్బోహైడ్రేట్లు) లభిస్తాయి కానీ, శరీరానికి అత్యవసరమైన ప్రొటీన్లు, ఐరన్, కాల్షియం, ఫైబర్ వంటివి తగినంతగా అందవు. దీనివల్ల గర్భిణులలో పోషకాహార లోపం ఏర్పడే ప్రమాదం ఉంది. ఇది దీర్ఘకాలంలో తల్లి ఆరోగ్యంపై, కడుపులోని బిడ్డ ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.అంతేగాక కఠిన ఉపవాసాల వల్ల రక్తంలో చక్కెర స్థాయులు (బ్లడ్ షుగర్) పడిపోయి తల తిరగడం, నీరసం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని రకాల ఉపవాసాల్లో నీళ్లు కూడా తీసుకోకపోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడే ముప్పు అధికం. ముఖ్యంగా గర్భధారణ సమయంలో వచ్చే మధుమేహం (జెస్టేషనల్ డయాబెటిస్), రక్తహీనత (అనీమియా), అధిక రక్తపోటు వంటి సమస్యలు ఉన్నవారికి ఈ ప్రమాదం మరింత ఎక్కువ. గర్భం ఏ దశలో ఉందనే దానిపై కూడా ఉపవాసం ప్రభావం ఆధారపడి ఉంటుంది.

పండ్లపై స్టిక్కర్లు ఉన్నాయా?



యాపిల్ కొనగానే స్టిక్కర్ తీసేసి, నీళ్లతో కడిగి తినేస్తున్నారా? అయితే ఒక్క నిమిషం ఆగండి! పండ్లపై ఉండే చిన్న స్టిక్కర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని భారత 'ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ' (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సూచించింది. స్టిక్కర్ తీసేసి పండును కడగడం మాత్రమే సరిపోదని, అది అంటించిన చోట ఉండే తొక్కను తీసేయాలని లేదా ఆ చిన్న భాగాన్ని కోసేయాలని తెలిపింది. ఎందుకంటే స్టిక్కర్‌ను అంటించేందుకు వాడే జిగురు పండుపై మిగిలిపోయే అవకాశం ఉంది.

స్టిక్కర్ తీసేస్తే సరిపోదా?

చాలామంది యాపిల్, ఆరెంజ్, అవకాడో వంటి పండ్లపై ఉండే స్టిక్కర్లను తీసేసి నేరుగా తింటుంటారు. కానీ స్టిక్కర్ తొలగించినంత మాత్రాన దాని కింద ఉన్న ప్రాంతం పూర్తిగా శుభ్రమైందని భావించకూడదు. జిగురు అవశేషాలు అక్కడే ఉండొచ్చు. అందుకే ఆ ప్రాంతంలోని తొక్కను తొలగించడం లేదా చిన్న ముక్కను కోసేయడం మంచిది. ఈ జిగురు కెమికల్స్‌తో తయారవుతుంది. దాని వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

పండ్లపై స్టిక్కర్లు ఎందుకు పెడతారు?

సూపర్‌మార్కెట్లలో పండ్లపై కనిపించే ఇవి లేబుళ్లలా ఉపయోగపడతాయి. వాటిపై ఉండే కోడ్‌లతో పండ్ల రకం, ధర వంటి వివరాలను విక్రేతలు గుర్తిస్తారు. కొన్ని సందర్భాల్లో నాణ్యత, బ్రాండ్ వంటి ఇతర సమాచారాన్ని కూడా అందిస్తాయి. స్టిక్కర్ సులభంగా ఊడిపోయినా దాని జిగురు పూర్తిగా తొలగిపోయిందని అనుకోకూడదు.

పండ్లను కడిగితే సరిపోదా?

పండ్లు, కూరగాయలను తినే ముందు శుభ్రంగా కడగడం చాలా ముఖ్యం. కానీ స్టిక్కర్ అంటించిన చోట అదనపు జాగ్రత్త అవసరం. ముందుగా స్టిక్కర్‌ను తొలగించాలి. తర్వాత ఆ ప్రాంతంలోని తొక్కను తీసేయాలి లేదా చిన్న భాగాన్ని కోసేయాలి.

తొక్క తీయకుండా యాపిల్ తినాలనుకున్నా, స్టిక్కర్ ఉన్న చోటును చిన్నగా కోసి తొలగించవచ్చు.

పెళ్లికి ముందే బేబిని కనాలని ఉంది!

ఇది వినోదాత్మకమైన, వోద్వేగభరితమైన సాగే కథ. నరేశ్, అఖిల్, తరుణ్ భాస్కర్.. ఇలా వీళ్లంతా కాస్టింగ్‌లో జాయిన్ అయ్యాక మరింత క్రేజీ ప్రాజెక్ట్ అయ్యింది. ఈ సినిమా కోసం నేను ఇంటెన్స్ ప్రమోషన్స్ చేశా. వ్యక్తిగతంగా ఆనందంగా ఉన్నా కాబట్టి అంత ఎంజాయ్ చేస్తూ ప్రమోషన్స్‌లో పాల్గొన్నా. జగన్ మోహన్‌రెడ్డి లాంటి క్రేజీ ప్రాడ్యూసర్ లేకుంటే ఈ సినిమా ఇంత బాగా మన ముందుకు వచ్చేది కాదు. ఈ సినిమాలో నాకు పెళ్లి అవుతుందా.. కాదా అనేది తెరపై చూడాలి. ఈ సినిమాలోలా మా ఇంట్లో నా పెళ్లి గురించి ఏమాత్రం ఒత్తిడి లేదు. నీకు ఇష్టమైనప్పుడు పెళ్లి చేసుకోమనే మా వాళ్లు అంటారు. నాకైతే పెళ్లికి ముందే ఒక బేబిని కనాలని ఉంది. అది ఏ పద్ధతి లోనైనా అయి ఉండొచ్చు! మా కేరళ వివాహా వేడుకల్లో పూర్తిగా శాకాహారమే వడ్డిస్తారు. కానీ తెలంగాణ పెళ్లి వేడుకల్లో ఉండే కొత్త సంప్రదాయం తెలుసుకున్నా. మా కేరళలో ఇప్పుడు పెళ్లి వేడుకల్లో హల్దీ, మెహందీ అని కొత్త కొత్త పద్ధతులు వస్తున్నాయి. కానీ, గతంలో ఎంగేజ్‌మెంట్, పెళ్లి ఈ రెండే వేడుకలు జరిపేవారు.క్రేజీ కల్యాణం' సినిమాలో మా పాత్రలన్నీ పడే కష్టాలు ప్రేక్షకులకు కామెడీగా అనిపిస్తాయి. మా పాత్రల ద్వారా, ఆ సందర్భాల ద్వారా సహజమైన హాస్యం పుడుతుంది. స్క్రిప్ట్‌తోపాటు దర్శకుడిగా భద్రప్ప నిజాయితీతో కూడిన విధానం నచ్చి ఈ సినిమా ఒప్పుకున్నా. మా సినిమాలో తరుణ్ భాస్కర్ చేసిన బాలరాజు పాత్ర మనలో ఒకడు, మన రోజువారీ జీవితంలో నుంచి వచ్చిన పాత్ర అది. ఆ క్యారెక్టర్‌లో చాలా ఫన్ ఉంటుంది. మా డైరెక్టర్, ప్రాడ్యూసర్ కూడా కొంతవరకు బాలరాజులే!




వేదికపై తల్లిదండ్రులను చూసి 'క్రేజీ కల్యాణం' దర్శకుడు ఎమోషనల్

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. ఈ సినిమా ద్వారా భద్రప్ప గాజుల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, రేపు (అక్టోబర్ 16న) విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన 'బారాత్' ప్రచార కార్యక్రమంలో దర్శకుడు భద్రప్ప భావోద్వేగానికి గురయ్యారు.



రోడ్డు భద్రతపై స్ఫూర్తిదాయక సందేశం



సుప్రీమ్ హీరో సాయి దుర్గా తేజ్ తన పుట్టినరోజు వేడుకలను అభిమానులు, శ్రేయోభిలాషుల మధ్య ఆత్మీయంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, తన అభిమానులకు పలు కీలక అంశాలపై ఆయన ఇచ్చిన సందేశంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. అభిమానులు చూపిన ప్రేమకు ధన్యవాదాలు తెలుపుతూ, వారి భవిష్యత్తుకు సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా సాయి తేజ్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నొక్కి చెప్పారు. అభిమానులతో కలిసి 'హెల్మెట్ పెట్టుకోవాలి' అని నినదింపజేయడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన కోరారు.

'రణబాలి' గ్రాండ్ రిలీజ్..

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటించిన భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి' ప్రపంచవ్యాప్తంగా రేపు (అక్టోబర్ 16) ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఇది కేవలం ఒక సినిమా విడుదల మాత్రమే కాదు, తన అభిమానులకు విజయ్ దేవరకొండ ఇచ్చిన ఓ మాట నిలబడుతుందా లేదా అని తేల్చే పరీక్ష కూడా. 'రణబాలి' ప్రీ-రిలీజ్ వేడుకలో విజయ్ మాట్లాడిన తీరు, ఆయన కనబరిచిన ఆత్మవిశ్వాసం అభిమానుల్లో కొత్త ఉత్సాహం తీసుకువచ్చింది.కొన్నేళ్ల క్రితం 'నోటా' చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచినప్పుడు విజయ్ దేవరకొండపై భారీ విమర్శలు వచ్చాయి.



'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్' (నెట్ ఫ్లిక్స్) సిరీస్ రివ్యూ!

కథానాయకుడిగా హర్ష చెముడు అడపాదడపా సినిమాలు చేస్తూ వెళుతున్నాడు. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన వినోదభరితమైన కథలను .. పాత్రలను ఎంచుకుంటున్నాడు. అలాంటి హర్ష నుంచి 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్' అనే సిరీస్ వచ్చింది. 6 ఎపిసోడ్స్ తో రూపొందిన ఈ సిరీస్ కి, బాబు డేగల దర్శకత్వం వహించాడు. ఈ నెల 9వ తేదీ నుంచి ఈ సిరీస్ 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది.'మాచర్ల' పరిధిలోని 'రెంట చింతల' అనే విలేజ్ అది. అక్కడ శ్రీనివాసరావు ఫ్యామిలీ నివసిస్తూ ఉంటుంది. ఆయన ఐదు ఎకరాల భూమిని .. రెండు రైసు మిల్లులను చూసుకుంటూ ఉంటాడు. ఆయన ఒక్కగానొక్క కొడుకే 'తేజ' (హర్ష చెముడు). నల్లగా .. లావుగా ఉండే తేజకి, పెళ్లీడు కూడా దాటిపోతూ ఉంటుంది. దాంతో తమ కొడుక్కి పెళ్లి కాకుండా పోతుందేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటారు. హైదరాబాద్ వెళ్లి ఏదైనా సాఫ్ట్ వేర్ సంస్థలో జాబ్ సంపాదిస్తే, అమ్మాయిలు వెతుక్కుంటూ వస్తారని తేజకి స్నేహితుడు రమేశ్ సలహా ఇస్తాడు. పెళ్లి కావాలంటే ముందుగా మంచి జాబ్ కావాలనే తేజ ఆలోచనను తండ్రి సమర్థిస్తాడు. దగ్గరుండీ మరీ హైదరాబాద్ పంపిస్తాడు. హైదరాబాద్ లో ఫ్రెండ్ రూములో ఉంటూ మొత్తానికి ఒక సాఫ్ట్ వేర్ సంస్థలో తేజ జాబ్ సంపాదిస్తాడు. అక్కడే 'మధు' (ఐశ్వర్య) పనిచేస్తూ ఉంటుంది. అక్కడే అతనికి 'నాయుడు' .. గోపీ .. అనూష .. సునీత పరిచయమవుతారు. నాయుడు అక్కడ పనిమనిషిగా ఉన్న 'సునీత'ను ఇష్టపడతాడు. ఇక గోపీ .. అనూష తరచూ గొడవపడుతూ ఉంటారు. తేజ దగ్గర సబ్జెక్ట్ లేదనే అసహనాన్ని చూపిస్తూ ఉంటుంది మధు. ఈ నేపథ్యంలోనే అనుకోకుండా తేజకి .. మధుకి పెళ్లి చూపులు జరుగుతాయి. మధుకి అభ్యంతరం లేకపోతే, ఒకరినొకరు అర్థం చేసుకోవడం కోసం హైదరాబాద్ లో ఒకే ఇంట్లో ఉండేలా చేస్తానని తేజ తండ్రి శ్రీనివాసరావు చెబుతాడు. తనతో పెళ్లికి .. అంతవరకూ తనతో కలిసి ఉండటానికి మధు ఎలాంటి పరిస్థితులలోను ఒప్పుకోదని తేజ భావిస్తాడు. కానీ విదేశాలకు వెళ్లాలనే ఉద్దేశంతో ఉన్న మధు, 'వీసా' వచ్చేవరకూ 'తేజ' ఫ్లాట్ లో ఉండటం బెటర్ అనుకుంటుంది. ఇద్దరూ ఒకే కప్పు క్రిందికి చేరతారు.అయితే తామిద్దరం కలిసి ఉంటున్నట్టుగా ఆఫీసులో ఎవరికీ చెప్పద్దని తేజతో అంటుంది మధు. రోజులు గడుస్తుంటాయి.



రజనీ 'జైలర్ 2'పై కమల్ ప్రశంసలు.. స్పందించిన దర్శకుడు నెల్సన్



సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన 'జైలర్ 2' చిత్రం గురువారం విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో లోకనాయకుడు కమల హాసన్ తన మిత్రుడు రజనీకాంత్‌కు, చిత్ర బృందానికి సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలియజేశారు."నా ప్రియ మిత్రుడు రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' ఈరోజు విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఘనవిజయం సాధించిందని తెలిసి సంతోషించాను. నా మిత్రుడు రజనీకాంత్‌కు, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్ పిక్చర్స్ బృందానికి నా హృదయపూర్వక అభినందనలు" అని కమల్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.కమల్ పోస్ట్‌పై దర్శకుడు నెల్సన్ వెంటనే స్పందిస్తూ.. "మీ ప్రశంసలకు ధన్యవాదాలు కమల హాసన్ సర్. మీలాంటి దిగ్గజం నుంచి ఇలాంటి ప్రశంసలు రావడం మాకు దక్కిన గొప్ప గౌరవం" అని పేర్కొన్నాడు.ఈ చిత్రంపై పలువురు సినీ ప్రముఖులు సైతం ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తొలి రోజు మొదటి ఆట చూసిన నటుడు ధనుష్.. "జైలర్ 2 తప్పకుండా చూడాల్సిన సినిమా. ఇదొక బ్లాక్‌బస్టర్. తలైవా అభిమానులకు ఇదొక పెద్ద పండగ" అని పేర్కొన్నాడు. దర్శకుడు లింగుస్వామి మాట్లాడుతూ.. 'బాషా' చిత్రం తర్వాత రజనీకాంత్ కెరీర్‌లో ఇదే అత్యంత శక్తివంతమైన పాత్ర అని, ముఖ్యంగా ప్రథమార్ధంలో ఆయనను ఆవిష్కరించిన తీరు అద్భుతమని కొనియాడాడు. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ సైతం రజనీ స్క్రీన్ ప్రెజెన్స్, నెల్సన్ దర్శకత్వ ప్రతిభ, అనిరుధ్ సంగీతాన్ని ప్రశంసించాడు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.